క్లుప్తంగా

ప్రజలకు శుద్ధజలం సరఫరా



కారంచేడులో రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ నేతాజీ

కారంచేడు: గ్రామస్తులకు శుద్ధమైన తాగునీటిని అందించడంలో పంచాయతీ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కె. నేతాజీ ఆదేశించారు. గురువారం కారంచేడు గ్రామస్తులకు తాగునీటిని సరఫరా చేసే జయప్రకాశ్ నారాయణ చెరువును సందర్శించారు. చెరువు నుంచి సంపునకు సరఫరా చేసే పైపుల పరస్థితి ఎలా ఉంది, సంపు నుంచి ట్యాంక్‌కు ఎలా పంపింగ్ జరుగుతుంది అనే విషయాలపై ఆయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిర్లక్షంగా వ్యవహరించవద్దని హెచ్చరించారు.

చెత్త నుంచి సంపద సాధ్యం

అద్దంకి: గ్రామాల్లోని చెత్త తొలగించి పరిశుభ్రం చేయడమే కాకుండా, ఆ చెత్త నుంచి సందప సృష్టించాలని డీఎల్‌పీవో పద్మావతి అన్నారు. గురువారం మండలంలోని శింగరకొండపాలెం గ్రామాన్ని పరిశీలించారు. తడి చెత్త, పొడి చెత్త ఎలా సేకరించాలో అవగాహన కల్పించారు. ఎంపీడీవో శింగయ్య ఉన్నారు.

13 నుంచి నిరవధిక సమ్మె

అద్దంకి: ఈనెల 13వ తేదీ నుంచి మున్సిపల్ ఇంజినీర్ విభాగం కార్మికులు నిరవధిక సమ్మెకు వెళ్లనున్నారు. ఈ మేరకు సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం అద్దంకి సీఐటీయూ ఆఫీస్, సుందరయ్య భవనంలో నాయకులు పి. తిరుపతి రెడ్డి అధ్యక్షతన గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. జేవీవీ నాయకులు డాక్టర్ వై. హనుమంతరావు మాట్లాడుతూ పట్టణంలో ప్రజలకు మౌలిక సౌకర్యాలు అందిస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయకపోవడం శోచనీయమని, 15000 రూపాయలు ఇవ్వటం దారుణమన్నారు. కార్మికులంతా ఏకమై కనీస వేతనం కోసం పోరాటాలు చేయాలన్నారు. అప్పుడే ఈ ప్రభుత్వాలు గుర్తిస్తాయని చెప్పారు. సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏడాది నుంచి దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తున్నా స్పందించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. ఇంజినీరింగ్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు పి. జాను, యు. శామ్యూల్ కమిటీ సభ్యులు మార్కు, రైతు సంఘం నాయకులు పనక రామాంజనేయులు, ఎస్ కే బాష, పి. ఆదాం పాల్గొన్నారు.

ప్రకాశం పంతులు స్మారక చిహ్నం ఏర్పాటు చేయండి




కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి

అద్దంకి రూరల్: రాజధాని అమరావతి నగరంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేయాలని అద్దంకి కి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి గురువారం కలెక్టర్ జి. వెంకట మురళికి వినతి పత్రం సమర్పించారు. ప్రకాశం పంతులు గొప్పతనం రాబోయే తరాలకు కూడా తెలియజేయాలని అందుకు రాజధానిలో చిహ్నం ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రణాళికతో గ్రామాల అభివృద్ధి

జె.పంగులూరు: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి ఎంపీడీఓ కె. స్వరూపారాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ తేళ్ళ నాగమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఆయా శాఖ అధికారులు వారి శాఖల అభివృద్ధి గురించిన విషయాలు తెలియజేశారు. తూర్పు తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన ఉపాధి హామీ పని కూలీలు వారం రోజులు చేస్తే రెండు రోజులు మాత్రమే కూలి పడుతుందని తెలిపారు. దీనిపై ఎంపీడీఓ కె. స్వరూపారాణి మాట్లాడుతూ సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేస్తామని తెలిపారు.

కోడ్‌తో ప్రమాదాలకు చెక్



సిలిండర్ కోడ్ ఇదే..



- గడువుదాటిన సిలిండర్లతో ప్రమాదం
- అప్రమత్తతో ప్రమాదాలకు చెక్
- గడువు తేదీపై అవగాహన తప్పనిసరి అంటున్న అగ్నిమాపక శాఖ అధికారులు
- నియోజకవర్గంలో 20వేలకు పైగా గ్యాస్ కనెక్షన్లు
- రోజుకు నియోజకవర్గంలో వాహనాల ద్వారా 1500 వరకు సిలిండర్ల డెలివరీ

అద్దంకి:

మనిషి జీవితంలో వంట ఎంత ముఖ్యమో గ్యాస్ సిలిండర్ కూడా అంతే ముఖ్యం. అయితే దీనితో జాగ్రత్తలు లేకుంటే ప్రమాదాలు తప్పవు. గత సంవత్సరం గ్యాస్ లీక్ కావడంతో ఇల్లు దగ్ధమైన సంఘటనలు, గృహోపకరణాలు కాలిపోయిన సంఘటనలు బల్లికురవ, మండలం, అద్దంకి మండలాల్లో ఐదు చోట్ల సంభవించాయి. అయితే వెలిగించే సమయంలో, డెలివరీ సమయంలోనూ జాగ్రత్తలు పాటిస్తే, దాని కోసం కొంచెం సమయం కేటాయిస్తే ప్రమాదాలు జరగకుండా చూసుకోవచ్చు. గ్యాస్ సిలిండర్ ఇనుముతో చేసింది కదా, దాన్ని గురించి పట్టించుకునేదేముంది అనుకుంటే పొరబాటే. గ్యాస్ సిలిండరుకు గడువు ఉంటుంది. అదే విధంగా గ్యాస్ కంపెనీలు సైతం ఈ విషయంపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరో వైపు అగ్నిమాపక శాఖ వారు ప్రతి సంవత్సరం వారోత్సవాలు నిర్వహిస్తూ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూనే ఉన్నారు రుచికరమైన ఆహార పదార్థాలను తయారు చేసుకోవడానికి సిలిండర్ ఎలా ఉపయోగపడుతుందో, జాగ్రత్త లేకుంటే అదే విషాదాన్ని మిగులుస్తుంది. అందుకు డెలివారీ బాయ్ గ్యాస్ సిలిండర్ తెచ్చి ఇవ్వగానే వెంటనే తీసి ఇంట్లో పెట్టుకోకుండా దానిపై గడువు తేదీని పరిశీలించి చూడాలి. ఒక వేళ గ్యాస్ తీసుకునే సమయంలో సరైన సమాచారంతో తీసుకున్నా దాన్ని నెలల తరబడి అక్కడే ఉంచి వాడినా ప్రమాదం తప్పదు. సిలిండరుపై ముద్రించిన గడువు లోపుగానే వాడాలని అగ్నిమాపక శాఖ అధికారులు సూచిస్తున్నారు. బాయ్ గడువు తీరిని సిలిండర్ ఇస్తే దాన్ని తిరిగి వెనక్కు పంపాలని చెబుతున్నారు.

గడువు తీరింది గుర్తించడం ఎలా?

సిలిండరు రింగుకింది భాగంలో నాలుగు భాగాలుగా, నాలుగు ఇంగ్లీషు అక్షరాలు ఉంటాయి. దానిపై ఏ, బీ, సీ, డీ అక్షరాలు ఉంటాయి. ఏ ఉంటే అది జనవరి నుంచి మార్చి వరకు, బీ అనే అక్షరం ఉంటే అది ఏప్రిల్ నుంచి జూన్ నెల వరకు ఇలా ప్రతి మూడు నెలలకు ఒక అక్షరం రాసి ఉంటుంది. దాన్ని గమనించాలి.

ఖాళీ సిలిండరుకు గడువు..

ఖాళీ సిలిండరుకు కూడా నిర్ణీత కాలపరిమితి ఉంటుంది. ఇది వినియోగదారులకు సబంధించిన విషయం కాదు. ఖాళీ సిలిండరు తయారీ డేటు నుంచి ఏడేళ్ల వరకు ఉపయోగించుకోవచ్చు. ఏడేళ్లు దాటిన సిలిండరును డీలర్ నుంచి కంపెనీ వెనక్కు తెప్పించుకోవాలి. ఆ తరువాత వాడితే ప్రమాదాలు

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి



పాపరాజుతోట సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు



రామానగర్‌లో ప్రత్యేక అలంకరణలో సాయి



స్వర్ణలో అలంకరణలో సాయిబాబా



యద్దనపూడిలో విశేష అలంకరణలో సాయినాథుడు

చీరాల అర్బన్: గురుపౌర్ణమి సందర్భంగా గురువారం పట్టణంలోని పలు సాయిబాబా దేవాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. పేరాలలోని సాయిబాబా మందిరంలో సాయి నామస్మరణ పారాయణలు నిర్వహించారు. స్వామివారికి బంగారు కిరీటాన్ని అలంకరించారు. అనంతరం వేలాది మందికి అన్న సంతర్పణ చేశారు. స్థానిక పాపరాజుతోటలోని సాయిబాబా దేవాలయంలో, బెస్తపాలెంలోని సాయిబాబా మందిరం వద్ద భక్తులు పోటెత్తారు.

వేటపాలెం: మండలం పరిధిలోని అక్కాయిపాలెం శివారులో గల సాగర సాయినాథుని మందిరం, దేశాయిపేటలోని షిరిడీసాయి మందిరం, రామానగర్‌లోని షిరిడీ సాయినాథుడి మందిరాల్లో సాయి నాథుడి నామస్మరణ మార్మోగాయి. గురువుకు ప్రతిరూపమైన దత్తమందిరాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కారంచేడు: స్థానిక సాయినగర్‌లో కొలువుదీరిన సాయిబాబా వారి దేవాలయంలో గురుపూర్ణిమ వేడుకలన ఘనంగా నిర్వహించారు. హరేరామ ఆశ్రమ పీఠాధిపతులు ప్రణవానందగిరి స్వామి వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి క్షీరాభిషేకములను నిర్వహించారు.

చినగంజాం: మండలంలోని చినగంజాం, కొత్తపాలెం, పెదగంజాం గ్రామాల్లోని షిర్డీ సాయిబాబా ఆలయంలలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చినగంజాం శ్రీ హనుమ సాయి కుటీరంలో వేంచేసియున్న షిర్డీ సాయిబాబా మందిరంలో ఆలయ కమిటీ ధర్మకర్తల ఆధ్వర్యంలో పూజారి శంకరమంచి హనునంత రావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. దాత గెల్లి వెంకట లక్ష్మీనారాయణ అన్నదాన కార్యక్రమానికి ఆర్థికంగా సహకరించారు. కొత్తపాలెం రైల్వే స్టేషన్, పెదగంజాంలో పూజలు జరిగాయి.




పర్చూరులోని సాయిబాబా మందిరంలో పాలాభిషేకం

పర్చూరులో...

గురుపౌర్ణమి సందర్భంగా పర్చూరు సాయిబాబా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి స్థానికులు సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో సాయిబాబా మందిరానికి వచ్చి పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. సాయి నామ సంకీర్తన, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అమితంగా అలరించాయి.



తోటవారిపాలెంలో వెండి కిరీటంతో భక్తులకు దర్శనమిస్తున్న సాయిబాబా



శాకాంబరిదేవిగా కామాక్షి అమ్మవారు

ఇంకొల్లులో..

మండల కేంద్రమైన ఇంకొల్లులోని సాయి బాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలను గురువారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం హారతి అనంతరం ఆలయంలో అభిషేక కార్యక్రమాలను నిర్వహించి, సాయి నామసంకీర్తన నిర్వహించారు.

యద్దనపూడి: సాయినాథుని విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు, అష్టోత్తర సహస్రనామ అర్చనలు, విశేషపూజలు నిర్వహించారు. మండలంలోని గన్నవరం, యద్దనపూడి గ్రామాల్లో తమ మొక్కులు చెల్లించుకున్నారు.

చీరాల అర్బన్: పట్టణంలోని పాపరాజుతోటలోని శ్రీకామాక్షి సోమేశ్వర ఆలయంలో ఆషాఢమాసం సందర్భంగా గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని శాకాంబరి దేవిగా అలంకరించారు.

బల్లికురవ: గురుపౌర్ణమి వేడుకలు గురువారం మండలంలోని నక్కబొక్కలపాడు, ఉప్పుమాగులూరు గ్రామాల్లో వైభవంగా నిర్వహించారు. రాత్రికి పల్లకి సేవ నిర్వహించారు.

చీరాల టౌన్: రూరల్ మండలంలోని ఈపురుపాలెం, తోటవారిపాలెం, దేవాంగపురి, సాయికాలనీ, తదితర గ్రామ పంచాయతీల్లోని సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు, నిర్వహించారు. అనంతరం 5వేల మందికి అన్నదానం చేశారు.



నక్కబొక్కలపాడులో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



చినగంజాంలోని సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నేడు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

యద్దనపూడి: మండలంలోని తనుబొద్దివారిపాలెంలో శుక్రవారం పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గాదె మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రావూరి వేణుబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తనుబొద్దివారిపాలెంలోని తనుబొద్ది మస్తాన్‌రెడ్డి (కెపాల్ మస్తాన్‌రెడ్డి) కల్యాణ మండపంలో సాయంత్రం 3 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి మండల పార్టీ నాయకులు , అనుబంధ విభాగాల అధ్యక్షులు , స్థానిక ప్రజాప్రతినిధులు , వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలి



అడుసుమల్లి జెడ్పీ పాఠశాలలో విజేతలకు బహుమతులందిస్తున్న ఉపాధ్యాయులు



కారంచేడులో మాట్లాడుతున్న మాజీ న్యాయమూర్తి సునీల్‌చౌదరి

కారంచేడు: మీ బిడ్డల బంగారు భవిష్యత్తుకు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాల్సి ఉందని ఏపీ హైకోర్టు మాజీ జడ్జి తాళ్ళూరి సునీల్‌చౌదరి అన్నారు. గురువారం కారంచేడు మండల పరిషత్ ఆదర్శ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మెగా పీటీఎం 2.0లో ముఖ్య అతిథిగా మాట్లాడారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం తెలుగు భాషలో మాత్రమే బోధించే వారని, ప్రస్తుతం ఇంగ్లీషు, తెలుగు మాధ్యమాల్లో బోధించడం శుభసూచికమన్నారు. ఎంఈఓ మొలబంటి వెంకటేశ్వర్లు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పృథ్వీరాజ్, హెచ్ఎం సరోజిని, పావులూరి శ్రీనివాసరావు, సీహెచ్ మహాలక్ష్మమ్మ, పద్మావతి, తల్లితండ్రులు పాల్గొన్నారు.

పేరెంట్స్.. టీచర్స్ సమావేశాల నిర్వహణ

పర్చూరు(చినగంజాం): పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో గురువారం నిర్వహించారు. పిల్లలచే తల్లిదండ్రులకు పూజా కార్యక్రమం నిర్వహింపజేశారు. తల్లిదండ్రులకు ఆటలపోటీలు నిర్వహించారు.

క్షయ నివారణ అందరి బాధ్యత



క్షయవ్యాధి నివారణ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రణయ్

చీరాల రూరల్: క్షయవ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వైద్యులు పేర్కొన్నారు. టీబీ ముక్తి భారత్ అభియాన్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక వైకుంఠపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ ప్రణయ్, డాక్టర్ మనీష, డాక్టర్ శిరీష మాట్లాడారు. ఆర్టీపీసీఆర్ కళ్లె పరీక్షలు తప్పని సరిగా చేయించుకోవాలని సూచించారు. టీబీహెచ్‌వీ శ్రీలక్ష్మి, ఆయా పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంజనేయునికి లక్ష తమలపాకుల అర్చన



లక్ష తమలపాకుల అర్చనలో ప్రసన్నాంజనేయ స్వామి

అద్దంకి: బాపట్ల జిల్లా అద్దంకి మండలం శింగరకొండ క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారికి గురువారం లక్ష తమలపాకుల అర్చన చేశారు. తదనంతరం మహానివేదన, పంచహారతులు కార్యక్రమం నిర్వహించారు. ఉభయదాతలుగా న్యూమార్నింగ్ స్టార్ ట్రావెల్స్ యజమానులు పానకాల శ్రీనివాసరావు యశోద దంపతులు పాల్గొన్నారు.

చెత్త కుప్పలు తొలగించండి

అద్దంకి: గ్రామాల్లో చెత్త పేరుకుపోకుండా చూడాలని, పరిశుభ్రతే లక్ష్యంగా గ్రామ పంచాయతీ సెక్రటరీలు పనిచేయాలని డీఎల్‌పీవో పద్మావతి అన్నారు. గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యలయంలో పంచాయతీ సెక్రటీలు, ఐదు మండలాల ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించారు.

పంట మార్పిడి విధానం మేలు

బల్లికురవ: రైతులు భూసార పరీక్షలు ఆధారంగా పంటల సాగుతో పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని వ్యవసాయాధికారి పి. శ్రీనివాసరావు కోరారు. గురువారం ఉప్పుమాగులూరు, కె. రాజుపాలెం గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. పొగాకు పంటకు గిరాకీ లేనందున ఈ ఏడాది సాగుకు స్వస్తి పలకాలన్నారు. మొక్కజొన్న, ప్రత్తి, మిరప, కంది, అపరాల సాగు చేపట్టాలన్నారు.

కేఆర్‌కేలో కొత్త కోర్సు ప్రారంభం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

అద్దంకి రూరల్: స్థానిక కేఆర్‌కే డిగ్రీ కళాశాలలో సొసైటీ ఆఫ్ జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఉన్నతి ఫౌండేషన్ సీఈఓ ఎ. పద్మనాభన్‌తో ఉద్యోగ నైపుణ్యాలపై 30 రోజులు పాటు ప్రత్యేక శిక్షణ కోర్సును ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వేల్పుల మోహన్‌రావు గురువారం తెలిపారు. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎంవీ సత్యనారాయణ, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్డినేటర్ మస్తాన్‌వలి, అధ్యాపకులు ఎస్. షర్మిలారాణి పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక హారతి



ఉప్పుటూరులో సామూహిక హారతి నిర్వహిస్తున్న సభ్యులు, భక్తులు

పర్చూరు(చినగంజాం): ఆషాఢ పౌర్ణమి సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం సామూహిక హారతి ఉత్సవం ఘనంగా నిర్వహించినట్లు మండల ధర్మప్రచారక్ తులసి రాజేష్ తెలిపారు. మండలంలోని ఉప్పుటూరు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురుపూజోత్సవం (వ్యాసపూర్ణిమ), సామూహిక హారతి ఉత్సవం నిర్వహించారు. అదే విధంగా యద్దనపూడి మండలం యనమదల గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో సామూహిక హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

చీరాల అర్బన్: ప్రభుత్వం అందించే పథకాలను, సౌకర్యాలు విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో నిర్వహించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. విద్యార్థినులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. అలానే తల్లిదండ్రుల చేత వారి పిల్లల క్రమశిక్షణను ఉద్దేశించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ఎస్.స్నేహలత అధ్యక్షత వహించగా టీడీపీ నాయకులు ఎం .మహేంద్రనాథ్, ఏఎంసీ చైర్మన్ కె.జనార్ధన్, ఒన్‌టౌన్ సీఐ ఎస్.సుబ్బారావు, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.మురళి, పేరెంట్ టీచర్ మీటింగ్ మెంబర్ శంభు ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు. ఏపీ మోడల్ స్కూల్‌లో టూటౌన్ సీఐ నాగభూషణం, రిటైర్డు డీఐఈఓ ఎర్రయ్య, ప్రిన్సిపాల్ జె.సరళ పాల్గొన్నారు.

రికవరీలు వేగవంతం చేయండి

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందిస్తున్న రుణాలను పొదుపు మహిళలు సక్రమంగా వినియోగించుకునేలా కృషి చేయాలని ఏపీఎం కె.మధుసూదనరావు సూచించారు. బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో గురువారం వీవోఏలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధి కోసం రుణాలను అందిస్తుందని, పొదుపు మహిళలు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధి పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. సామాజిక పెట్టుబడి నిధి రికవరీలు రూ.45లక్షలు ఉండగా రూ.37లక్షలు వసూళ్లు చేశారని, మిగిలిన రికవరీలు త్వరగా చేయాలన్నారు. సీసీ, సీవీలు, పొదుపు సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

హెపటైటిస్‌తో దుష్ప్రభావాలు

అద్దంకి: ఎక్కువ సమస్యలు ఎదుర్కొనే వ్యక్తులు, హై రిస్క్ వ్యక్తులకు హైపటైటిస్ బీ, సీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్ పేర్కొన్నారు గురువారం హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, బాపట్ల జిల్లా హెచ్‌ఐవీ/ ఎయిడ్స్ నియంత్రణ సమీపకృత వ్యూహం దిశ, ఆంధ్రప్రదేశ్ నియంత్రణ సంస్థ వారి ఆధ్వర్యంలో అద్దంకి పట్టణంలోని గుర్రాల కాలనీలో పరీక్షలను ప్రారంభించినారు. ఈ సందర్భంగా హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ డీసీ హెచ్ కోటేశ్వరావు మాట్లాడుతూ హెచ్‌ఐవీతో పాటు ఇతర వైరల్ ఇన్‌ఫెక్షన్లను అరికట్టడంలో ఉపయోగపడుతుతుందన్నారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ స్వచ్ఛంద సంస్థ ఏఎస్ఎం జె. రాధమ్మ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఎంపికైన స్త్రీ లబ్ధిదారులకు పరీక్షలు నిర్వహించారు. నెగటివ్‌గా వచ్చిన వారికి హెపటైటిస్ బీ వ్యాక్సిన్ ఇస్తామని చెప్పారు.